# బంగారుబాట

# కళాకారులు

## డా॥ బి.వి. పట్టాభిరామ్ Ph.D.

ఎమెస్కో

కళాకారులు

డా॥బి.వి. పట్టాభిరామ్ Ph.D
ప్రశాంతి కౌన్సిలింగ్ & HRD సెంటర్,
E1 సామ్రాట్ కాంప్లెక్సు, సెక్రటేరియట్ రోడ్,
హైదరాబాదు - 500 004,
Phones: 040-2339 6090/2323 3232
e-mail: bvpattabhiram@hotmail.com
www.pattabhiram.com

ప్రథమ ముద్రణ
నవంబర్, 2002

మూల్యము : రూ. **35-00**

ముద్రణ:
వాసు ఆఫ్‌సెట్ ప్రింటర్స్
విజయవాడ - 3

కూర్పు :
పల్లవి గ్రాఫిక్స్
కాకినాడ. ఫోన్: 0884-2361158

ప్రచురణ
**ఎమెస్కో బుక్స్**
1-2-7, బానూకాలనీ,
గగన్‌మహల్ రోడ్, దోమలగూడ
హైదరాబాద్ - 500 029, తెలంగాణ
ఫోన్ & ఫ్యాక్స్ : 040-23264028
www.emescobooks.com
e-mail: emescobooks@yahoo.com

# నామాట

ఏ మహనీయుడి చరిత్ర చదివినా, వారి బాల్యంలో ఇంట్లో పెద్దలు కథలు చెప్పేవారనీ, మానవతా విలువలు బోధించేవారనీ, మహాత్ముల చరిత్రలు చెప్పి, ప్రేరణ కల్గించేవారనీ ఉంటుంది. ఇప్పుడు కాలం మారింది. కథలు చెప్పేవారు కంచికి చేరారు. తల్లిదండ్రులిద్దరు ఉద్యోగాలు, వ్యాపారాలు లేదా ఇతర వ్యవహారాల్లో పడిపోయారు. సమష్టి కుటుంబాలు సన్నబడిపోయాయి. మరి నేటి బాల బాలికలకు కథలు చెప్పేదెవరు అంటే 'టెలివిజన్' అనే సమాధానం వస్తుంది. మనముందు తరానికి సంబంధించిన మహనీయుల గురించి, వారు అనుసరించిన బాటల గురించి చెప్పేదెవరు? పిల్లలకు అటువంటి వారి గురించి ఒకటిరెండు పాఠాలు పెట్టినా, మళ్ళీ మరొకరు వచ్చి ఆ పాఠాలు తీసేయడం జరుగుతుంది. అందుకే నేటి బాలబాలికలకు ఇటువంటి పుస్తకాల అవసరం ఉందనిపించి ఈ రచనలు చేసాను. వీటికి ప్రేరణ కల్గించినవారిద్దరు; మా నాన్నగారు భావరాజు సత్యన్నారాయణగారు. ఆయన చార్టర్డు ఇంజనీరుగా ఉండేవారు. 93 ఏళ్ళు జీవించారు. రెండవవ్యక్తి ప్రముఖ పాత్రికేయులు శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు గారు. ఆయన ఆంధ్రప్రభ వార పత్రికలో ఈ వ్యాసాలు రాయించారు. దాదాపు మూడేళ్ళపాటు 'బాలలకు బంగారుబాట' శీర్షికతో వీటిల్లో కొన్ని వ్యాసాలు ప్రచురించారు. వారికి, పత్రిక యాజమాన్యానికి కృతజ్ఞతలు.

ఆంధ్రప్రభలో ఈ జీవితగాథలు ప్రచురితమవుతున్న సమయంలోనే వేలాది పాఠకులు రాసిన లేఖలు నాలో ఎంతో ప్రేరణ కల్గించాయి. కొన్ని జిల్లాల్లో హెడ్మాస్టర్లు పిల్లలచేత పాఠశాల అసెంబ్లీలో ప్రతి సోమవారం చదివిస్తున్నట్లు. శనివారం దానికి సంబంధించిన మౌఖిక పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపినపుడు నాకెంతో ఆనందం కల్గింది. అలాగే కర్నాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు తమ తెలుగు పాఠాల్లో 7,9వ తరగతుల్లో నా వ్యాసాలు ప్రచురించినపుడు నాకు పరమానందం కలిగింది.

ఈ సీరిస్‌లో ప్రస్తుతం ఆరు పుస్తకాలు మీకోసం సిద్ధంగా ఉన్నాయి. అవి 1.స్ఫూర్తి ప్రదాతలు, 2. జాతిరత్నాలు, 3. కళాకారులు, 4. సంఘసేవకులు, 5. సాహిత్యవేత్తలు, 6. శాస్త్రవేత్తలు. ఇవి పిల్లలకే కాక పెద్దలకు కూడా స్ఫూర్తి కలిగిస్తాయన్న విశ్వాసం నాకుంది. అందుకే ఇవి చదవండి, చదివించండి. బాలబాలికలకు బహుమతిగా అందించండి. వారిలో ప్రేరణ కలిగించండి.

ఈ పుస్తకంలో చక్కని చిత్రాలు గీసిన మా అన్నయ్య శ్రీ బి.వి.సత్యమూర్తికి, ప్రముఖుల చరిత్ర పుస్తకాలు సంపాదించిపెట్టిన హితులు ఉన్నారు వారందరికీ నమస్సులు.

బి.వి.పట్టాభిరామ్

## ఇందులో...


1. కోలాచలం శ్రీనివాసరావు . . . . . . . . . . . 5
2. కోడి రామమూర్తి నాయుడు . . . . . . . . . . 8
3. ముత్తుస్వామి దీక్షితార్ . . . . . . . . . . . . . . 11
4. వాల్ట్ డిస్నీ . . . . . . . . . . . . . . . . . . . . 15
5. హ్యారీ హౌడిని . . . . . . . . . . . . . . . . . . 18
6. పి. సి. సర్కార్ . . . . . . . . . . . . . . . . . 21
7. ఆదిభట్ల నారాయణదాసు . . . . . . . . . . . 24
8. రాజా రవివర్మ . . . . . . . . . . . . . . . . . 27
9. త్యాగయ్య . . . . . . . . . . . . . . . . . . . . 30
10. పికాసో . . . . . . . . . . . . . . . . . . . . . 34
11. చార్లీచాప్లిన్ . . . . . . . . . . . . . . . . . 37
12. బళ్ళారి రాఘవ . . . . . . . . . . . . . . . . 40
13. మొజార్ట్ . . . . . . . . . . . . . . . . . . . . . 43
14. టెర్రీ ఫాక్స్ . . . . . . . . . . . . . . . . . . 46
15. దామెర్ల రామారావు . . . . . . . . . . . . . 50
16. న్యాయపతి రాఘవరావు . . . . . . . . . . . 52
17. మోర్సు . . . . . . . . . . . . . . . . . . . . . 55
18. లీనార్డ్ డి విన్సీ . . . . . . . . . . . . . . . 58
19. పిఠాపురం రాజా . . . . . . . . . . . . . . . . 61
20. కాశీనాథుని నాగేశ్వరరావు . . . . . . . . . 64
21. పింగళి వెంకయ్య . . . . . . . . . . . . . . . 67
22. ముట్నూరి కృష్ణారావు . . . . . . . . . . . . 71
23. అశుతోష్ ముఖర్జీ . . . . . . . . . . . . . . 74
24. అయ్యంకి వెంకటరమణయ్య . . . . . . . . . 78
25. సి.వై. చింతామణి . . . . . . . . . . . . . . . 81
26. మాడపాటి హనుమంతరావు . . . . . . . . . 85

# చారిత్రక నాటక పితామహుడు



**కోలాచలం శ్రీనివాసరావు**

**(1854-1919)**

**శ్రీనివాసరావు బళ్ళారిలోని కమలాపురంలో జన్మించాడు. వృత్తిరీత్యా ప్లీడరు. తెలుగు నాటక రంగం అభివృద్ధి చేయాలని కంకణం కట్టుకున్న కళాపిపాసి. స్వయంగా ఎన్నో నాటకాలను రాసి ప్రదర్శించి 'ఆంధ్ర చారిత్రక నాటక పితామహుడు' గా ఎనలేని కీర్తి గడించాడు.**

దాదాపు వంద సంవత్సరాలక్రితం తెలుగులో నాటకాలు వేళ్ళమీద లెక్కించేంత మాత్రమే ఉండేవి. అందుచేత ఇతర భాషా నాటకాలు ఎక్కువగా ప్రదర్శితమవుతుండేవి.

అటువంటి సమయంలో నిక్షేపంగా ప్లీడరు వృత్తి చేసుకుంటున్న ఓ వ్యక్తి తెలుగు నాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని కంకణం కట్టుకున్నాడు. ముందస్తుగా తెలుగులో నాటకాలు రాయందే అభివృద్ధి రాదని గ్రహించి కలం చేతబట్టాడు. ఆనాటి నుంచి ఆ కలం ఆఖరి నిమిషం వరకూ రాస్తూనే ఉంది. ఒకటీ, రెండు కాదు ఇరవై ఎనిమిది తెలుగు నాటకాలు, నాలుగు ప్రహసనాలు, ముప్పై ఎనిమిది నాటకేతర రచనలు చేసి తెలుగువారి ప్రతిష్ఠను దిశదిశలా వ్యాపింపచేసిన మార్గదర్శి పేరు శ్రీ కోలాచలం శ్రీనివాసరావు.

'ఆంధ్ర చారిత్రక నాటక పితామహుడు'గా కీర్తినొందిన కోలాచలం శ్రీనివాసరావు 1854 మార్చి 13న హంపీ సమీపంలోని కమలాపురంలో జన్మించాడు. తండ్రి శ్రీ సేతుపతి శాస్త్రి అప్పటి అనెగొంది రాజైన తిరుమల దేవరాయల వద్ద దివానుగా పనిచేసేవాడు. ఆ కాలంలో ఇతర భాషలకు చెందిన అనేక నాటక కంపెనీల వారు రాజుల సమక్షంలో ప్రదర్శించి, ధన, కనక వాహనాదులు బహుమతులుగా స్వీకరించేవారు రాజాస్థానానికి చెందిన సభ్యులందరూ అవి చూసి ఎంతో ఆనందించేవారు.



కానీ చిన్నవాడైన శ్రీనివాసరావుకి మాత్రం ఏమాత్రం తృప్తి ఉండేది కాదు. దానికి కారణం వాటిల్లో ఒక్క తెలుగు నాటకం కూడా లేకపోవటమే. అప్పటికి తెలుగు నాటకరంగం అంతగా అభివృద్ధి చెందలేదు. నాటకాభిలాష ఉన్న తెలుగువారు ఇతర భాషా నాటకాల్లో నటించేవారు. ముఖ్యంగా షేక్స్పియర్ నాటకాలు విధిగా చూసేవారు. శ్రీనివాసరావుకి తెలుగులో నాటకాలు బాగా రావాలనే కోరిక తీవ్రంగా ఉండేది. కానీ అతను అశక్తుడు. అపుడు అతని వయసు తొమ్మిది సంవత్సరాలే. అంతలోనే దురదృష్టవశాత్తు తండ్రి ఆకస్మికంగా మరణించాడు. 1863లో ఆ కుటుంబం బళ్లారికి తరలింది. అతని బావ శ్రీ కుప్పు సోమయ్య ఆ కుటుంబాన్ని చేరదీసి ఆదరించాడు.

కుప్పు సోమయ్య పెంపకంలో శ్రీనివాసరావు ఉద్దండ పండితుడయ్యాడు. తెలుగు సంస్కృతం, కన్నడం, మరాఠీ, ఇంగ్లీషు భాలలో ప్రావీణ్యం సంపాదించాడు. 1873లో మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణుడై అందరి ప్రశంసలూ పొందాడు. అనంతరం ఎఫ్ఏ పరీక్షలోనూ, బిఏ పరీక్షలోనూ ఉత్తీర్ణుడై, 1877లో అనంతపురం జిల్లా గుత్తిలో రెవిన్యూ శాఖలో చేరాడు. పన్నెండేళ్ళపాటు ఆ ఊళ్లో ఆ ఉద్యోగం చేశాడు. నిజానికి ఆ ఉద్యోగం తప్పనిసరై చేయాల్సి వచ్చింది. తనకెంతో ప్రియమైన నాటకరంగం అభివృద్ధి చేయటానికి నిర్ణయించుకుని ఉద్యోగానికి 1889లో రాజీనామా చేశాడు. అప్పటికి అతని వయస్సు 35 సంవత్సరాలు.

బళ్ళారి వచ్చిన తర్వాత అతని అన్నగారైన వెంకటరావు సలహా మీద న్యాయవాద వృత్తి పరీక్షలు పాసై ప్రాక్టీసు పెట్టాడు. ఇప్పుడు అతను స్వతంత్రుడు కాబట్టి తన దీక్షను కార్యరూపంలో పెట్టాడు. ప్రథమంగా 'సునందినీ పరిణయం' అనే నాటకాన్ని రచించి, సాహితీ సాంస్కృతిక రంగాల్లో సంచలనం సృష్టించాడు. తన స్నేహితులచే ఆ నాటకాన్ని వేయించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. అంతటితో ఆగక సుఖమంజరీ పరిణయం, మదాలసా సీమంతిని, సుల్తానా చాందుబీ, రామరాజు చరిత్ర, సత్య హరిశ్చంద్రీయం, కాళిదాసు, కీచకవధ, కుశలవ, గిరిజా కళ్యాణం, ద్రౌపదీ వస్త్రాపహరణం, ప్రతాపాక్బరీయము, ప్రహ్లాద, బభ్రువాహన, మానాపమానము, మైసూరు రాజ్యాభివృద్ధి, యువతీ వివాహము, రుక్మాంగద, లంకాదహనము, శిరోమణి, శిలాదిత్య, శ్రీరామ జననము, సీతాకల్యాణము, చంద్రహాస, చంద్రగిరి అభ్యుదయము, పాదుకా పట్టాభిషేకము, రాక్షసీ మహత్వాకాంక్ష అనే 28 నాటకాలు రచించి తెలుగు నాటకరంగ చరిత్రలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాడు. మరోపక్క ప్లీడరుగా మంచి పేరు తెచ్చుకున్నాడు. కొంతకాలం తర్వాత లాయరు వృత్తి వదిలి నాటకరంగంలో దిగాడు.